ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 18.0



ఎమ్మెల్యే బాలరాజు సతీమణికి ఛాన్స్

పోలవరం వైసీపీ సమన్వయకర్తగా రాజ్యలక్ష్మిని ప్రకటించిన అధిష్టానం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

అందరూ ఊహించినట్లుగానే వైసీపీలో మార్పులు చేర్పులు ఆరంభం అయ్యాయి. దీనికితోడు ఒకవేళ తనకు వద్దనుకంటే భార్యకో లేదా కుమారుడికి ఎమ్మెల్యే టికెట్ చాన్స్ ఇవ్వాలని నాయకత్వానికి చేసిన అభ్యర్థనలకు సమ్మతి లభిస్తోంది. ఈ కోణంలోనే పోలవరం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి సుదీర్ఘకాలం సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగిన తెల్లం బాలరాజును తప్పించి ఆయన సతీమణి తెల్లం రాజ్యలక్ష్మిని పోలవరం నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా మంగళవారం రాత్రి నియమించింది. మొదటి నుంచి బాలరాజును తప్పిస్తారనే వార్త నిజమైంది. ప్రత్యేకించి సర్వేలు, నిఘా వర్గాల సమాచార ప్రకారం మార్పులు చేర్పులకు వైసీపీ సుదీర్ఘ కసరత్తు చేసింది. సిట్టింగ్ ఎమ్మెల్యే బాలరాజును తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించుకుని నీకు టికెట్ లేదని ఖరాఖండిగా చానాళ్ల క్రితం తేల్చేశారు. దీనికి బదులుగా ఎస్టీ రిజర్వుడు కోటాలో రాజ్యసభకు అవకాశం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. బాలరాజు మాత్రం తనకు ఇవ్వకపోయినా పర్వాలేదు. తన సతీమణి, ఉన్నత విద్యావంతురాలు రాజ్యలక్ష్మికి ఒక్క చాన్స్ ఇవ్వాలని సీఎం జగన్ ఎదుట ప్రాధేయపడ్డారు. ఈ నేపథ్యంలో ఒకవైపు రాజ్యలక్ష్మి, మరోవైపు బుట్టాయగూడెం స్థానిక మహిళా నేత రామ తులసి మధ్య ప్రజాభిప్రాయం ఎలా ఉందనే దానిపై కొద్ది రోజులుగా నియోజకవర్గం అంతా అభిప్రాయసేకరణ చేశారు. కడకు రాజ్యలక్ష్మి అభ్యర్థిత్వం వైపు నాయకత్వం మొగ్గు చూపింది. ప్రత్యేకించి పోలవరం నియోజకవర్గంలో ఒక ఎస్టీ మహిళకు అవకాశం ఇచ్చినట్లు ఉంటుందని సిట్టింగ్ ఎమ్మెల్యే విన్నపాన్ని మన్నించినట్లవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నారు. పోలవరంలో ఎట్టకేలకు సస్పెన్స్‌కు తెరదించారు. ప్రస్తుత సమన్వయకర్త వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి అవుతారు. తెల్లం రాజ్యలక్ష్మి బుట్టాయగూడెం మండలం దొరమామిడి జడ్పీ హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు.

విజయరాజుకు లైన్ క్లియర్ !

ఏలూరు, జనవరి 2(ఆంధ్రజ్యోతి): చింతలపూడి వైసీపీ అభ్యర్థిగా ఎమ్మెల్యే ఎలీజాను తప్పించి, ఆయన స్థానంలో ఏలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కంభం విజయరాజును బరిలో నిలపాలని దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల సమాచారం. మంగళవారం విడుదలైన సమన్వయకర్తల జాబితాలో ఆయన పేరు లేకపోయిన ప్పటికీ 2-3 రోజుల్లో రానున్న మూడో జాబితాలో స్పష్టత రానుంది. మండలి చైర్మన్ కొయ్యే మోషన్‌రాజు వియ్యంకుడైన ఆయన 20 రోజుల క్రితమే తన ఉద్యోగానికి రాజీనామా చేసి, పార్టీ పనుల్లో నిమగ్నమవుతున్నారు.

ఆవిరైన నూతన ఆనందం

- డివైడర్ దాటివచ్చి ఢీకొన్న కారు
- మరో కారులో ఉన్న ముగ్గురి మృతి

7



మంత్రివర్గం మరచిపోయిన 'ఏలూరు'

మంత్రివర్యా.. మరిచారా !



- నలుగురు మినహా యావత్ మంత్రుల రాక
- రాకపోకలే తప్ప రోడ్ల మరమ్మతులకూ దిక్కు లేదు
- శిలాఫలకాలు, ప్రారంభోత్సవాల ఊసే లేదు
- జిల్లాకు ఓ మంత్రి కూడా లేకపోవడమే కారణమా ?

మంత్రులు వస్తున్నారు.. పోతున్నారే తప్ప జిల్లాలో ఒక్క పునాది రాయి వేసిన పాపాన పోలేదు. సభలు, సమావేశాలు, పెళ్లిళ్లు పేరంటాలంటూ వస్తున్న మంత్రులు, ముఖ్యమంత్రి జిల్లా వాసులకు ముఖం చూపిస్తున్నారే తప్ప ఏలూరుకు ఒరగబెట్టిందేమీ లేదు. నాలుగున్నరేళ్లుగా జిల్లాలో సీఎం జగన్ పదకొండుసార్లు పర్యటించారు. ఇక నయా, గయా మంత్రి వర్గం నుంచైతే దాదాపు 90 శాతం మంత్రులు జిల్లాకు వచ్చి పోయిన వాళ్లే. మంత్రులు రోజా, బొత్స సత్యనారాయణ, ఉషశ్రీచరణ్, సిదిరి అప్పలరాజు మినహా అందరూ జిల్లాకు వచ్చి వెళ్తూనే ఉన్నా ఏలూరు జిల్లా ఒక్కటంటే ఒక్క ప్రారంభోత్సవానికీ నోచుకోలేదు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి

వస్తున్నారు..వెళ్తున్నారు !

మంత్రులు వచ్చిన ప్రతీసారి ఆ పార్టీ మీటింగ్‌లు, సభలు, బస్సు యాత్రలు, పర్యటనలు, ఆనక పంచ్ డైలాగ్‌లు విసరడానికి తప్ప జిల్లాను ఏ నాయకులూ పట్టించుకోలేదు. కనీసం వారు ప్రయాణించి వచ్చిన రహదారులపై జాలి చూపినా ఈ పాటికి జిల్లాలో రోడ్లపై కనీసం గుంతలైనా మాయమయ్యేవి. పార్టీ అంతర్గత సమావేశాలు, నియోజకవర్గ అభివృద్ధి సమీక్ష కార్యక్రమాల నిమిత్తం జిల్లా ఇన్‌చార్జి మంత్రి విశ్వరూప్, విడదల రజని, జోగి రమేశ్, కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత ఇలా పలువురు మంత్రులు పదుల సంఖ్యలో పర్యటించారు. జిల్లాలో ఎన్ని విపత్తులు, సమస్యలు తలెత్తినా పరామర్శలు, పరిశీలనల నిమిత్తం వచ్చి పోతున్నారే తప్ప జిల్లాపై దృష్టి పెట్టలేదు. అదేమంటే ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేసేశామని వారు చెప్పడం కొసమెరుపు.

నాలుగున్నరేళ్లుగా..

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా జగన్ అప్పటి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో భాగమైన పోలవరం, కుక్కునూరు, ఏలూరు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. రాష్ట్రాన్ని, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని, నిధుల వర్షం కురిపిస్తానని ఎన్నో హామీలు కుమ్మరించారు. సీఎం అయ్యాక పర్యటనలే తప్ప జిల్లాకు పైసలు విదిల్చిన పాపాన పోలేదు. ఏలూరుకు మెడికల్ కాలేజీని కేటాయించిన కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తమ ఖాతాల్లో వేసుకుందే తప్ప నేటికీ ఆ కాలేజీ నిర్మాణంలో పురోగతి శూన్యమే. మంజూరైన మెడికల్ కాలేజీ కాస్తా ఈ నాయకుల అసమర్థత కారణంగా చేజారినంత పనైంది. తప్పుల కవరింగ్‌లో భాగంగా మాజీ మంత్రి ఆళ్ల నాని సైతం తిప్పలు పడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల నిమిత్తం నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం ఏలూరులో 2022 డిసెంబరు, 2023లో ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కలిపి మూడుసార్లు పర్యటించారు. ద్వితీయ పర్యటనలోనే ఆ బృందానికి మన అధికార పార్టీ నాయకులు చుక్కలు చూపించారు. ఖాళీ స్థలాల్లో కాలేజీని చూపించడంతో బృంద సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయ ఆవరణలో రూ.38 కోట్ల వ్యయంతో నిర్మితమవుతున్న తరగతి గదులు అసంపూర్తిగా ఉండడం, విద్యార్థులకు హాస్టల్ వసతి చూపించకపోవడంతో కాలేజీ రద్దుకు ఎన్‌ఎంసీ (నేషన్ మెడికల్ కౌన్సిల్) సిద్ధపడింది. దీంతో కంగారుపడ్డ రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక బృందాన్ని ఢిల్లీకి పంపి, మరోసారి పరిశీలన నిమిత్తం ఏలూరుకు ఎన్‌ఎంసీ రావాలని బతిమాలుకున్నారు. ఆ తర్వాత ఏప్రిల్ 17న ఏలూరుకు వచ్చిన ఎన్‌ఎంసీకి సరైన సమయంలో తరగతి గదులు, హాస్టల్ ఏర్పాటవ్వని క్రమంలో నగరంలోని రెండు అపార్ట్‌మెంట్లలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. అనంతరం ఏప్రిల్ 26న 150 ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు చేసుకోవచ్చని సూచిస్తూ మెడికల్ కాలేజీ మంజూరు చేసింది.

ఎన్నికల ముందైనా కనికరం చూపిస్తారా ?

వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఒకే ఒక్క ప్రారంభోత్సవం కాస్తా ఆ పార్టీ తీరును నవ్వుల పాలు చేసింది. 2019లో స్థానిక జలవనరుల శాఖ కార్యాలయం వద్ద నిర్మించిన ఓ భవనంలో నాలుగేళ్లుగా, నాలుగు అంతస్తుల్లో, నాలుగు శాఖలు పనిచేస్తుండగా, 2023 ఏప్రిల్ 27న ఆర్థికమంత్రిగా బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఏలూరుకు వచ్చి ఆ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఇదేం అభివృద్ధి మంత్రులారా.. అంటూ అప్పట్లోనే విమర్శలు వ్యక్తమయ్యాయి. అనంతరం మెడికల్ కాలేజీ శంకుస్థాపన, తాత్కాలిక కాలేజీ ప్రారంభోత్సవం సీఎం జగన్ వర్చువల్‌గానే ప్రారంభించారు. పశ్చిమ గోదావరిలో ఇద్దరు మంత్రులు ఉండగా, ఏలూరు జిల్లా తరఫున ఒక్క మంత్రి కూడా లేకపోవడంతో గడిచిన నాలుగున్నరేళ్లలో జిల్లాలో సమస్యలు తిష్ఠ వేశాయి. కనీసం ఎన్నికలకు ముందైనా కనికరం చూపించాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు.







కలెక్టరేట్ వద్ద చెవుల్లో పూలు పెట్టుకుని అంగన్వాడీల నిరసన, కైకలూరులో పశువుకు వినతి పత్రమిస్తున్న అంగన్వాడీలు, జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

నిరసన జ్వాలలు

పశువులకు అంగన్‌వాడీల వినతులు

- ఏలూరులో చెవిలో పూలు

ఏలూరు సిటీ, జనవరి 1: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె రోజురోజుకూ ఉధృతమవుతోంది. మంగళవారం నాటికి 22వ రోజుకు చేరింది. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగి స్తామన్నారు. జిల్లాలోని పలుచోట్ల అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని దున్నపోతు, గంగిరెద్దు, పశువు లకు వినతి పత్రాలు అందజేశారు. చాట్రాయి, దెందులూరు లో దున్నపోతుకు, పెదపాడులో గంగిరెద్దుకు, కైకలూరులో పశువుకు వినతి పత్రాలు అందజేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఏలూరులో చెవిలో పువ్వుపెట్టుకుని నిరసన తెలి పారు. అంగన్‌వాడీల పట్ల నిర్లక్ష్య వైఖరి మానుకోవాలని పోల వరం నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ పేర్కొ న్నారు. బుట్టాయగూడెంలో అంగన్‌వాడీల నిరసన కార్యక్రమా నికి ఏపీటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఇక జిల్లాలోని పోలవరం, ముసునూరు, నూజివీడు, ఉంగుటూరు, లింగపా లెం, భీమడోలు, కామవరపుకోట, చింతలపూడి, నిడమర్రు, కలిదిండి, ముదినేపల్లి, మండవల్లి ప్రాంతాల్లో నిరసన కార్యక్ర మాలు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి కార్మిక సంఘాల జేఏసీ సమ్మె

ఏలూరు టూ టౌన్/జంగారెడ్డిగూడెం, జనవరి 2: మునిసి పల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మిక సం ఘాల జేఏసీ పిలుపులో భాగంగా బుధవారం నుంచి మున్సి పల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ విభాగ కార్మికులు సమ్మెకు దిగనున్నారని ఏలూరులో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షు డు కృష్ణమాచార్యులు, జంగారెడ్డిగూడెంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) జిల్లా అధ్య క్షుడు కె.విఘ్నేష్ తెలిపారు. మంగళవారం ఏలూరుతో పాటు, జంగారెడ్డిగూడెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జంగారెడ్డిగూ డెంలో మునిసిపల్ కమిషనర్ భవానీప్రసాద్‌ను కలసి బుధవారం నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ఏలూ రులో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, కె.అప్పలరాజు, లక్ష్మణ మూర్తి, శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు. జంగారెడ్డిగూ డెంలో పట్టణ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జేవీ రమణరా జు, పట్టణ అధ్యక్షుడు కొత్తూరి నాగేశ్వరరావు, కార్యదర్శి బొక్కా శ్రీను, రేలంగి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో చర్చలు విఫలం

మునిసిపల్ కార్మిక సంఘాల నా యకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలమయ్యాయని సీఐటీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య తెలిపారు. మంగళవారం అమరావతిలో చర్చలు జరిగాయి. గత 8, 9 పీఆర్సీల ప్రకారం నాటి ప్రభుత్వాలు కనీస వేతనాలు ఇచ్చాయన్నారు. 11వ పీఆర్సీలో కనీస వేత నం రూ.20 వేలు ఉండగా, జగన్ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తుందన్నారు. చర్చల్లో కనీస వేతనం రూ.20వేలు డీఏ కలిపి ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స సత్యనా రాయణ, ఆదిమూలపు సురేష్ ఈ ప్రతిపాదనలు తిరస్కరిం చడంతో సమ్మె ఉధృతం చేస్తామన్నారు.

జిల్లాలో పోలీస్ యాక్టు 30 అమలు

ఏలూరు క్రైం : జిల్లాలో పోలీస్ యాక్టు 30 అమలులో ఉందని జిల్లా ఎస్పీ డి.మేరీప్రశాంతి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్ ముట్టడికి అనుమతి లేదని ప్రభుత్వ ఉద్యోగ విధులకు ఆటంకం కల్గించినా, ప్రభుత్వ ఆస్తులకు హాని కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్ వాడీ కార్యకర్తలకు కలెక్టరేట్ ముట్టడి చేయడానికి అనుమతి లేనందున ముట్టడికి రావద్దని విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ జిల్లా నాయకులు

నేడు కలెక్టరేట్ వద్ద 12 గంటల ధర్నా

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 2 : ప్రతీనెలా అప్పులు తెస్తేనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతభత్యాలు చెల్లించే పరిస్థితికి చేరుకున్న రాష్ట్రప్రభుత్వం ఆర్థికస్థితిగతులపై వెంటనే శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏలూరు లోని సంఘ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు కావస్తున్నా సీఎం జగన్ ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతీనెలా ఒకటో తేదీ జీత భత్యాల చెల్లింపు, బకాయిలకు నిధులను విడుదల చేయాలన్న డిమాండ్లతో ఇప్పటికే యూటీఎఫ్ చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా ఈనెల 3న కలెక్టరేట్ వద్ద ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు 12 గంటల పాటు ధర్నా చేపడుతున్నట్టు వెల్లడించారు. సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. తమ ఆందోళనకు ప్రభుత్వం స్పందించని పక్షంలో ఈనెల 9, 10వ తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో 36 గంటలపాటు ధర్నా చేపడతామన్నారు ఓపీఎస్ అమలు కోసం 'ఓట్ ఫర్ ఓపీఎస్' నినాదంతో ఈనెల 28న ధర్నా చేపడతామన్నారు. యూటీఎఫ్ జిల్లా నాయకులు శివశంకర్, రంగమోహన్, పీవీ నరసింహారావు, కనకదుర్గ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ఆచంట నుంచే ఎన్నికల శంఖారావం

7న టీడీపీ అధినేత చంద్రబాబు రాక.. బహిరంగ సభ : టీడీపీ సమావేశంలో నేతల స్పష్టం

ఆచంట, జనవరి 2 : ఆచంట నుంచి తెలుగుదేశం-జనసేన ఎన్నికల శంఖారావం పూరించనున్నట్లు టీడీపీ జిల్లా అ ధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ప్రకటించారు. ఈ నెల 7న ఇక్కడ జరిగే భారీ బహిరంగ సభకు టీడీపీ అధినేత చంద్రబాబు విచ్చేస్తున్నారని తెలిపారు. మంగళవారం ఆచంటలో జరిగిన టీడీపీ సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ఆచంట లో జరిగే సభకు ఏడు నియోజకవర్గాల నుంచి లక్ష మందికి పైగా జనం వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సభకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ రానప్పటికి టీడీపీ, జనసేన సమన్వయంతోనే సభను విజయవంతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామ న్నారు. ఆచంట సభ టూర్ కో ఆర్డినేటర్, రాజమండ్రి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ ఈ బహిరంగ సభకు చలో ఆచంటగా నామకరణం చేశామన్నారు. ఈ సభతో ఎన్నికల కురుక్షేత్రానికి వెళుతున్నట్లు తెలిపారు. శాడిస్టు సీఎం వైఎస్ జగన్ వల్ల రాష్ట్రం సర్వ నాశనమైందని, ఈ రాష్ట్రానికి మళ్లీ వెలు గులు నింపేందుకు టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయన్నారు. 90 రోజుల్లో ఈ ప్రభుత్వాన్ని సాగనంపడం ఖాయమన్నారు. గత ఎన్నికల్లో కోడి కత్తి డ్రామాతో జగన్ అధికారంలోకి వచ్చారని ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు వచ్చాయన్నారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామ రాజు మాట్లాడుతూ సభకు భారీ ఎత్తున జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని కోరారు. తాడేపల్లిగూడెం ఇన్ చార్జి వలవల బాబ్జి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలు అన్నివి ధాలా మోసపోయారని, ప్రజలంతా టీడీపీ వైపు చూస్తున్నా రన్నారు. ఈ సందర్భంగా ఆచంట నుంచి మార్టేరు వెళ్లే రోడ్డులో ఒక లే అవుట్ స్థలాన్ని బహిరంగ సభకు అనుకూలంగా ఉంటుందని గుర్తించారు. మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పీతల సుజాత, మాజీ ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, నల్ల మిల్లి రామకృష్ణారెడ్డి, కలవపూడి శివ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, నరసాపురం ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

10, 11 తేదీల్లో నరసాపురం- సికింద్రాబాద్‌ల మధ్య స్పెషల్ ట్రైన్‌లు

నరసాపురం, జనవరి 2: సంక్రాంతి పండుగ రద్దీని పరిగణలోకి తీసుకుని ఈ నెల 10, 11 తేదీల్లో నరసాపురం- సికింద్రాబాద్‌ల మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. 07251 నంబర్‌తో 10వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు నరసాపురంలో స్పెషల్ ట్రైన్ బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఐదు గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ జిల్లాలో పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు స్టేషన్‌లలో ఆగుతుంది. గుంటూరు, నల్గొండ, మిర్యాలగూడ మీదుగా సికింద్రాబాద్ వెళ్తుంది. 07252 నంబర్‌తో అదే రోజు రాత్రి 11.30కు సికింద్రాబాద్‌లో బయలుదేరి వరంగల్, ఖాజీపేట, ఖమ్మం మీదుగా మరుసటి రోజు ఉదయం 8.30కు నరసాపురం చేరుకుంటుంది.

ఐలూ జాతీయ కేంద్ర కమిటీ సభ్యురాలిగా శైలజ


ఓరుగంటి శైలజ

ఏలూరు క్రైం, జనవరి 2 : ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలూ) జాతీయ కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఏలూరుకు చెందిన న్యాయవాది ఓరుగంటి శైలజను ఎన్నుకున్నారు. గత డిసెంబరు 28, 29, 30 తేదీల్లో కోల్‌కతాలో జరిగిన ఐలు 14వ జాతీయ మహాసభల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 26 రాష్ట్రాల నుంచి 900 మంది ప్రతినిధులు ఉండగా ఏపీ నుంచి 37 మంది పాల్గొన్నారు. రాష్ట్రానికి చెందిన సుంకర రాజేంద్రప్రసాద్ అఖిల భారత ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు.

రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో పొగాకు పంటకు నష్టం: ప్రశాంత్‌కుమార్


పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతునర్న ప్రశాంత్ కుమార్

సీతానగరం, జనవరి 2:రాష్ట్ర వ్యాప్తంగా 14 వేల హెక్టార్లలో పొగాకు పంట దెబ్బతిందని పొగాకు బోర్డు చైర్మన్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రఘుదేవపురంలోని పొగాకు పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పొగాకు బోర్డు కేవలం రైతుల అవసరాలను గుర్తించి వారికి అనుకూలంగా ప్రభుత్వంతో చర్చించి పనులు చేయించడం తప్ప హామీలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పొగాకు రైతుల పరిస్థితి, పంట పాడైన విధానం అధికారులు, మంత్రుల వద్దకు తీసుకువెళ్లే ప్రయత్న లోపం లేకుండా చేశామని, రాష్ట్ర ప్రభు త్వం నుంచి సరైన స్పందన రావడం లేదన్నారు. బీజేపీ నేత నీరుకొండ వీరన్న చౌదరి, పొగాకు బోర్డు సభ్యులు కాట్రగడ్డ సత్యనారాయణ మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి పొగాకు బోర్డు తొలగించి దేవరాపల్లి బోర్డులో కలపడం వలన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, సబ్సిడీపై వచ్చే ఎరువులు కూడా రైతులకు అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్షన్ సూపరింటెండెంట్ జీఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సబ్సిడీపై ఎరువులు ఇవ్వడానికి బోర్డుకు అభ్యంతరంలేదని, కానీ రైతు కమిటీ సభ్యులు అంతదూరం వచ్చి ఎరువులు తీసుకువెళ్లే అవకాశం లేదని చెప్పడం వలన ఇవ్వడం లేదన్నారు. సహకార సంఘాల ద్వారా ఎరువులు ఇచ్చే అవకాశం పరిశీలించాలని రైతులు కోరారు.


సాంగ్‌ను రిలీజ్ చేస్తున్న కరాటం తదితరులు

అనన్య చిత్రం విజయవంతం కావాలి

జంగారెడ్డిగూడెం, జనవరి 2 : సినిమాల్లో చిన్న, పెద్ద అని విభజన తగదని ప్రేక్షకులను మెప్పించిన ప్రతి సినిమా గొప్ప సినిమాయేనని ప్రముఖ సినీ నిర్మాత, ఎగ్జిబిటర్ కరాటం రాంబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం పరిసరాల్లో సిద్ధిధాత్రి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై బి.ప్రసాద్ రాజు దర్శకుడిగా నిర్మించిన అనన్య చిత్రం ఫస్ట్ సాంగ్ స్థానిక నూకాలమ్మ ఆలయంలో రిలీజ్ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కరాటం మాట్లాడుతూ, అనన్య చిత్రం హర్రర్ నేపథ్యంలో నిర్మించిన సినిమా అని, కుటుంబం అంతా చూడదగ్గ చిత్రం అని పేర్కొన్నారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ, మన ప్రాంతంలో సినిమాల నిర్మాణానికి అన్ని సౌకర్యాలు, లొకేషన్లు ఉన్నాయని తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన పండు, టెక్స్‌మో శ్రీరాములు, నిర్మాత జంధ్యాల గంగాధరశర్మ, సహనిర్మాత బుద్దాల సత్యనారాయణ, సింగంశెట్టి సత్యనారాయణ, కె.ఎస్. శంకరరావు, కనుపర్తి శ్రీనివాస్, వేణుమాధవ్, షేక్‌లాల్, హీరో జైరామన్ జుత్తిగ, రాజేష్ పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి


టీకా వేస్తున్న జేడీ

ద్వారకాతిరుమల, జనవరి 2: పాడి రైతులు అపోహలు విడనాడి పశుసంపదను కాపాడుకునేందుకు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు సూచించారు. రామన్నగూడెంలో మంగళవారం 520 గేదెలు, 170ఆవులకు టీకాలు వేశారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 31 వరకు టీకాలు వేయనున్నట్లు చెప్పారు. పశువైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పాడిపశువులకు ఉచితంగా టీకాలు వేస్తారని పేర్కొన్నారు. ఏలూరు డివిజన్ డీడీ డాక్టర్ టి. గోవిందరాజు, ఏడీ సాయిరమేష్, పశువైద్యాధికారి డాక్టర్ అంగర సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ముదినేపల్లి-గుడివాడ రోడ్డులో ధాన్యాన్ని కాపాడుతున్న కూలీలు

వాతావరణంలో మార్పు.. రైతు గుండెల్లో గుబులు!

ముదినేపల్లి, జనవరి 2 : వాతావరణం ప్రతికూలంగా మారటంతో నడి రోడ్డుపై ధాన్యాన్ని ఆరబెట్టుకున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గత రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో వర్షం పడుతుందేమోనని రోడ్ల వెంబడి ఆరబెట్టిన ధాన్యం రాశులను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ముదినేపల్లి నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరం రోడ్ల వెంబడి ధాన్యం రాశులు నిల్వ ఉన్నాయి. వాటిని పరదాలతో కప్పుకుంటూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరగకపోవడం, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ జాప్యం జరుగుతుండటంతో రోడ్ల వెంబడి ధాన్యం ఎక్కడికక్కడే ఉండిపోయింది. తేమశాతం తగ్గించేందుకు రైతులు గత పది రోజులుగా ముదినేపల్లి, పెయ్యేరు, పెదగొన్నూరు, వాడవల్లి తదితర గ్రామాల్లో వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆరబెట్టారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

105 ఏళ్లుగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

- నేటి నుంచి ప్రారంభం
- దాతల సహకారంతో ఉత్సవాలు
- కర్నాటక సంగీత కళాకారుల గానమాధుర్యం..


త్యాగరాజస్వామి, భమిడిపాటి సూర్యనారాయణ, కారుమూరి నరసింహమూర్తి

భీమవరంటౌన్, జనవరి 2 : త్యాగరాజు ఆరాధనోత్సవాలు.. జిల్లాలో ప్రముఖంగా వినిపించే పేరు. త్యాగరాజ గానసభ ఆధ్వర్యంలో నిర్వహించే త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో ఎంతో ప్రసిద్ధిగాంచిన కర్నాటక సంగీత కళాకారులు తమ గానమాధుర్యంతో పట్టణ సంగీత రసజ్ఞులను ఓలాడించిన చరిత్ర ఉంది. గత 105 సంవత్సరాలుగా నిర్విరామంగా ఈ ఉత్సవాలు జరుగుతుండడం విశేషం. కేవలం దాతల సహకారంతోనే ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 1919లో పట్టణానికి చెందిన సర్వాధర్మయ్య మహనీయులు త్యాగరాజ ఊంఛా వృత్తినే స్వీకరించిన సంగీతప్రియుడు ధర్మయ్య, త్యాగరాజ ఆరాధనోత్సవాలను మొదటగా పంచారామక్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర, జనార్ధనస్వామి ఆలయంలో ప్రారంభించి మూడేళ్ల పాటు నిర్వహించారు.

పిదప స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామ చేసిన భమిడిపాటి సూర్యనారాయణ ఏకధాటిగా 15 సంవత్సరాలు నిర్వహించారు. అనంతరం కారుమూరి నరసింహమూర్తి ఆ బాధ్యతను స్వీకరించి రజతోత్సవం చేశారు. ఆస్థాన కవీంద్రుడు శ్రీపాద కృష్ణశాస్త్రి, సంగీత విద్వాంసుడు హరినాగభూష ణంలను పట్టణ పురవీధుల్లో ఊరేగించి సత్క రించి గౌరవించారు. ఆయన కిరాణా మర్చంట్స్ అసోసియేషన్, ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్, ఛాంబర్ ఆఫ్ కామర్సు వంటి సంస్థల వ్యవస్థాపకులుగా ఉన్నారు. కారుమూరి సారథ్యంలో బైద్యనాథ్ భగవతార్, మహావాది వెంకటప్పయ్య, ఆదిభట్ల నారాయణదాసు, దీక్షిత దాసు, ద్వారం నాయుడు నరసింగరావు నాయుడు, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి ఎందరో మహానుభావులు ఇక్కడ కచేరీలు నిర్వహించారు. ఆయన కుమారుడు వెంకటేశ్వరరావు 50 సంవత్సరాలు పాటు ఉత్సవాలను నిర్వహించారు. సంగీత విద్వాంసులు డి.కె.పట్టామాళ్, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, రాధా సిస్టర్స్, ఎం.ఎల్. వసంత కుమారి, పి.లీల, శ్రీరంగం గోపాలరత్నం, మాండలిన్ శ్రీనివాస్, షేక్ చినమౌలా, అన్నవరపు రామస్వామి, ఎం.ఎల్.ఎన్.రాజు, తిరుపతి పొన్నారావు, కున్నకుడి వైద్యనాథన్ వంటి సంగీత విద్వాంసులతో సర్వోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వీరి హయంలోనే అధ్యక్షులుగా గన్నాబత్తుల నారాయణమూర్తి, గన్నాబత్తుల పెదతాత, గవర శ్రీమన్నారాయణ త్యాగరాజభక్త సభను బలోపేతం చేశారు. చెరుకువాడ సుబ్బారావు, పులపర్తి వెంకటరామయ్య, ముసలయ్య, తలవర్తి కృష్ణమూర్తి, జోశ్యుల అచ్యుతరామయ్య, భూపతిరాజు రామకృష్ణంరాజు ఎనలేని సేవలు అందించారు. వెంకటేశ్వరరావు హయంలోనే పారిశ్రామికవేత్త యు.కె.విశ్వనాధరాజు అధ్యక్షులుగాను, గమని రాజు కార్యదర్శిగాను క్రియాశీలకంగా వ్యవహరించారు. చెరుకువాడ సోదరులు, నూలి లక్ష్మి, కురిశేటి లక్ష్మి, వేగేశ్న రంగరాజు, కనుమూరి సత్యనారాయణరాజు, కె.కె.ఆర్. గాంధీరాజు కార్యదక్షులుగా నిర్ణయించి త్యాగరాజ మ్యూజిక్ అకాడమిగా రీ గ్రేడ్ చేయించి ఆరోధనోత్సవాలు జరిపిస్తున్నారు. బుధవారం నుంచి ఈ నెల 8 వరకు 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలు, త్యాగరాజస్వామి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

మత్స్యకారులకు మెరుగైన జీవనోపాధికి కృషి

కేంద్ర మంత్రి పర్షోత్తం రూపాలా


సమావేశంలో మాట్లాడుతున్న పర్షోత్తం రూపాలా

ఉండి, జనవరి 2 : కేంద్ర ప్రభుత్వం మత్స్యకారుల మెరుగైన జీవనోపాధికి ప్రత్యేకంగా పాటుపడుతుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి పర్షోత్తం రూపాలా అన్నారు. వాండ్రంలోని ఆక్వా ట్రేడర్స్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి సిదిరి అప్పలరాజు విచ్చేశారు.రూపాలా మాట్లాడుతూ, మత్స్యకారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. 2030 నాటికి విదేశాలకు లక్ష కోట్ల విలువైన మత్స్య సంపద ఎగుమతికి ప్రభుత్వం ప్రణాళిక బద్దంగా పనిచేస్తుందన్నారు. ఇప్పటికే తొమ్మిది రాష్ట్రాలలో పర్యటించి మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. అప్పలరాజు మాట్లాడుతూ, మత్స్యకారుల స్థితిగతులలో మార్పురావాలని రాష్ట్రప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఆక్వారైతులకు కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటుకు సహకారిస్తుందన్నారు. అనంతరం వీరికి ఆక్వారైతులు తమ సమస్యలను విన్నవించారు. రాజ్యసభసభ్యుడు బీదా మస్తాన్‌రావు, అప్సడా వైస్ చైర్మన్ రఘురాం, జిల్లా జాయింట్ కలెక్టరు సుందరరామ్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులరాజు, సోము వీర్రాజు, భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.


ఎంపికైన క్రీడాకారులు

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు వైఎస్సార్ హెల్త్ వర్సిటీ జట్టు..

ఏలూరు స్పోర్ట్స్, జనవరి 2: డాక్టర్ వైఎస్సార్ హెల్త్ సైన్సెస్ వర్సిటీ పురుషుల క్రికెట్ జట్టును ఎంపిక చేసినట్టు ఫిజికల్ డైరెక్టర్ బి.వి.ఎస్.ఎమ్ శ్రీనివాసరాజు మంగళవారం తెలిపారు. కె.వి అభిషేక్, ఆర్.పూర్ణచందర్, వై.గౌతమ్, జి.ప్రవీణ్‌కుమార్, జి.శివనిరంజన్, ఏ.అన్వేష్‌బాబు, డి.కిరణ్, సిహెచ్. రాజేష్, ఎస్.నితిన్, ఏ.బి. రక్షిత్, ఎం.లిఖిత్, పి.సునీల్‌కుమార్, షేక్ గంజికుతుబ్, ఎం.సాయిషణ్ముక్, వి.సాయిచందు, సచిన్ చౌదరి, స్టాండ్‌బైగా కె.పి.ఎస్ రామకృష్ణ, డి.ప్రకాష్, ఎస్‌కె మహ్మద్‌జక్కీ, ఎస్. కిరణ్‌గోపాల్‌లను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 7 నుంచి 16 వరకు చెన్నైలో జరుగుతాయని చెప్పారు. ప్రతిభ ప్రాతిపదికన జట్టును ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు.

నేడు, రేపు నన్నయలో ప్లేస్మెంట్ డ్రైవ్

రాజమహేంద్రవరం, జనవరి 2 : ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో బుధ, గురువారాలలో ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జి.వి.కె. బయోసైన్సెస్ ఆర్గస్ లైఫ్‌సైన్స్ నిర్వహిస్తున్న ఈ ప్లేస్మెంట్ డ్రైవ్‌కు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. రాతపరీక్షలో ఉత్తీర్ణులైన వారికి టెక్నికల్, హెచ్.ఆర్.రౌండ్ నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని జి.వి.కె. బయోసైన్సెస్ ఆర్గస్ లైఫ్‌సైన్స్ సంస్థలో నెలకు రూ.27 వేల జీతంతో ఉద్యోగం కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను లేదా విశ్వవిద్యాలయం ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ బి.జగన్మోహనరెడ్డిని సంప్రదించాలని కోరారు.


నన్నయ విశ్వవిద్యాలయం మహిళా క్రికెట్ జట్టు

సౌత్ ఇండియా మహిళా క్రికెట్ పోటీలకు 'నన్నయ' జట్టు ఎంపిక

దెందులూరు, జనవరి 2: సౌత్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా క్రికెట్ పోటీలకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ (రాజమండ్రి) క్రికెట్ జట్టును మంగళవారం ఎంపిక చేశారు. గోపన్నపాలెంలోని శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో ఐదు జిల్లాల కళాశాలల పరిధిలో 55 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన 16 మందితో పాటు మరో ఐదుగురిని స్టాండ్‌బైగా ఎంపిక చేశారు. కోయంబత్తూరులో త్వరలో జరగనున్న పోటీల్లో నన్నయ విశ్వవిద్యాలయం తరఫున పాల్గొంటారని నతానియేల్ వివరించారు. ఒలింపిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరడాని అచ్యుత్‌రావు, కాకి సుబ్బారావు, ఆదిరెడ్డి సత్యనారాయణ, రాజా, మహ్మద్ అబ్దుల్ హకీం భాషా పాల్గొన్నారు.

జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు దుర్గాప్రసాద్


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

భీమవరం రూరల్, జనవరి 2 : ఢిల్లీలో ఈనెల మూడు నుంచి 10వ తేదీ వరకు జరిగే 67వ జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ అండర్-17 పోటీల్లో తమ కళాశాల విద్యా ర్థి దుర్గాప్రసాద్ పాల్గొంటాడని డాక్టర్ సీఎస్ఎన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ మంగళవారం తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించగా ఆ జట్టు సభ్యుడైన దుర్గాప్రసాద్ ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడని పీడీ దావూద్‌ఖాన్ వివరించారు. కరస్పాండెంట్/సెక్రటరీ చీడే సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థిని అభినందించారు.

క్రైం కార్నర్

పుల్లమ్మ చెరువులో పడి బాలుడి మృతి



నిడమర్రు జనవరి 2 : ఆడుతూపాడుతూ అప్పటివరకు తమ వద్దే తిరిగిన చిన్నారి అంతలోనే చెరువులో శవమై తేలడంతో తల్లిదండ్రుల తల్లడిల్లిపోయారు. పెదనింద్రకొలనులో జరిగిన విషాదఘటన అందరినీ చలించివేసింది. వివరాలివి. సోమవారం రాత్రి భవాని దీక్ష స్వీకరించిన కడళ్ల రమేశ్ తన ఇంటి వద్ద భజన ఏర్పాటు చేశారు. అతడి సోదరి అత్తిలి మండలం గొంతేడుకు చెందిన పెచ్చెటి అనురాధ కుమారుడు వేదన్స్ (4)తో కలసి గ్రామానికి విచ్చేసింది. భజన అనంతరం అల్పాహారం ఏర్పాట్లు చేశారు. చిన్నారి మోటార్ సైకిల్‌తో ఆడుకొంటూ ప్రమాదవశాత్తు పుల్లమ్మచెరువులో పడిపోయాడు. ఎంత సేపటికీ బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఊరంతా వెతకడం మొదలుపెట్టారు. రాత్రి 10 గంటల సమయంలో చెరువులో వేదన్స్ శవమై కనిపించడంతో తల్లిదండ్రుల రోదనతో ఆప్రాంతం దద్దరిల్లింది.

టిప్పర్ ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

ఏలూరు క్రైం, జనవరి 2: రోడ్డుపై ఆగిపోయిన ఓ లారీని తప్పించబోయి రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని టిప్పర్ ఢీ కొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన ఘటన ఇది. వివరాలివి. ఏలూరు రూరల్ మండలం పోణంగి రోడ్డు వైఎస్ఆర్ కాలనీ ఐదవ రోడ్డులో నివాసం ఉంటున్న నేలపాటి యర్రమ్మ (60)కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు పెడనలో ఉంటున్నాడు. కుమార్తె ఏలూరు కొత్తపేటలో ఉంటుంది. కుమార్తె వద్దకు మంగళవారం సాయంత్రం వెళ్లి తిరిగి వస్తుండగా వడ్డెరగూడెం వద్ద రోడ్డు దాటుతున్న యర్రమ్మను టిప్పర్ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వన్‌టౌన్ సీఐ ఎస్. రాజశేఖర్ ఆదేశాల మేరకు ఎస్ఐ లక్ష్మణబాబు తన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు

పెదవేగి, జనవరి 2 : మండలంలోని జానంపేట సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివి. విజయరాయికి చెందిన పూజారి నాగశైలజ (18), అమ్మమ్మ లేగల నాంచా రమ్మతో కలిసి ఏలూరు ఆస్పత్రికి ఆటోలో బయలుదేరారు. జానంపేట దాటి గౌతమీ బ్రాందీ ఫ్యాక్టరీ దగ్గరకు వచ్చేసరికి ఏలూరు వైపు నుంచి వేగంగా వస్తున్న టిప్పర్ .. ఆటోను వేగంగా ఢీకొట్టడంతో అది నుజ్జునుజ్జు అయింది. ఆటోలో ఉన్న నాగశైలజ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె అమ్మమ్మ నాంచారమ్మ, ఆటో డ్రైవర్ దేవదాసు శామ్యూల్ తీవ్రంగా గాయ పడ్డారు. క్షతగాత్రులను ఏలూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

ఆవిరైన నూతన ఆనందం

- డివైడర్ దాటివచ్చి ఢీకొన్న కారు
- మరో కారులో ఉన్న ముగ్గురి మృతి
- ప్రమాదానికి కారణమైన కారులో అందరూ క్షేమం
- ఎనిమిది మందికి గాయాలు
- మృతులది హైదరాబాద్
- బంధపురం వద్ద ఘటన


మృతులు రమాదేవి, దివ్యప్రియ



దేవరపల్లి/ కొవ్వూరు/ రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 2 : దేవరపల్లి మండలం బంధపురం వద్ద మంగళవారం మధ్యాహ్నం రెప్పపాటులో ప్రమాదం జరిగింది. నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకుని బయలుదేరిన ఆ కుటుంబం.. అంతలోనే విషాదంలో మునిగిపోయింది. మృత్యువు డివైడర్ దాటుకుని వచ్చి ముగ్గురిని మింగేసింది. హైదరాబాద్‌లోని బీహెచ్ఈఎల్ మాక్స్ సొసైటీ ఏరియా, లింగంపల్లి సంగారెడ్డి జిల్లా ఆర్‌కే రామచంద్రపురం లో అక్కాతమ్ముళ్ల తమతమ కుటుంబాలతో నివాసం ఉంటున్నారు. నూతన సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు గత నెల 30న రెండు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది తమ సొంత కారులో వైజాగ్‌లోని తమ్ముడి అత్తవారింటికి వచ్చారు. రెండురోజుల పాటు ఆనందంగా గడిపారు. వైజాగ్ చుట్టు పక్కల ప్రాంతాన్నీ తిరిగిచూశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు వచ్చిన కారులోనే హైదరాబాద్‌కు బయలుదేరారు. మధ్యాహ్నం రెండు గంటలు అవుతుంది.. ఎక్కడైనా ఆగి భోజనం చేద్దామని అనుకుంటున్నారు. అంతలోనే కృష్ణాజిల్లా నందిగామ నుంచి వైజాగ్‌కు వెళుతున్న కారు డివైడర్ దాటుకుని వేగంగా దూసుకొచ్చి హైదరాబాద్ వైపు వెళుతున్న కారును ఢీకొట్టింది.. రెండు కార్లు తుక్కు తుక్కుఅయిపోయాయి. అటుగా వెళ్లే ప్రయాణికులకు ఏం జరిగిందో అర్థం కాలేదు.. వాహనదారులు తేరుకుని కార్ల దగ్గరకు వెళ్లి చూశారు. రెండుకార్లలో 11 మంది ప్రయాణిస్తుండగా అందరూ తీవ్ర గాయాలపాలయ్యారు. డ్రైవింగ్ చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన సుభాష్ గౌడ్‌కు తీవ్రగాయాలు కాగా తల్లి రమాదేవి (50), భార్య దివ్యప్రియ(25) కొవ్వూరు ఆసుపత్రికి 108లో తరలిస్తుండగా మృతి చెందారు. కుమార్తె గనిష్క (19నెలలు) దేవరపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. బావ మల్లికార్జున్, సోదరి స్వప్న, మేనల్లుడు విశ్వక్‌సాయి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డివైడర్ దాటుకువచ్చి ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న నందిగామకు చెందిన పాస్టర్ వేల్పుల విజయ మోహన్, సంజనీగ్రేస్, రోహిన్, అమితశ్రీలు దేవరపల్లిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరంతా క్షేమంగానే ఉన్నారు. ఘటన ప్రాంతాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సందర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని అధికారులకు ఆదేశించారు. ప్రమాదం నుంచి తేరుకున్న సుభాష్ గౌడ్ తన కుటుంబీకులు ఎలా ఉన్నారని పలుమార్లు అడగడం కంటతడి పెట్టించింది. తన తల్లి, భార్య, కుమార్తె మృతిచెందారని తెలియదు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అనసూరి శ్రీనివాసరావు తెలిపారు.

పెన్నాడలో వ్యభిచార గృహంపై దాడి

పాలకోడేరు, జనవరి 2 : పెన్నాడలో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. ఎఫ్‌సీఐకి వెళ్లేదారిలో ఓ అద్దె ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న సమాచారం అందుకున్న టూటౌన్ ఇన్‌చార్జి సీఐ జి.శ్రీనివాస్ తన సిబ్బందితో మంగళవారం ఆ గృహంపై దాడి చేసి ఓ మహిళను, సహకరించిన వ్యక్తితో పాటు మరో ఐదుగురు విటులను అరెస్ట్ చేశారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ బంగారంతో మోసగించిన మహిళపై ఫిర్యాదు

భీమవరం క్రైం, జనవరి 2 : నకిలీ బంగారంతో ఓ మహిళ మోసగించినట్లు వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదుపై ఒకటో పట్టణ ఎస్ఐ ఎన్. హనుమంతరావు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలివి. భీమవరం కురిశేటి వారి వీధిలోని ఓ బంగారు దుకాణానికి మూడేళ్ల బాలుడితో ఓ మహిళ వచ్చింది. పిల్లవాడికి మురుగులు సరిపోవడం లేదని విక్రయించేస్తున్నానని, మురుగులు ఎంత విలువ ఉంటే అంత బంగారు గొలుసు ఇవ్వాలని అడిగింది. 916 కేడీఎం, హాల్‌మార్క్ ఉండటంతో వ్యాపారి చేబ్రోలు విజయకుమార్ నమ్మారు. ఆమె వెళ్లిపోయిన తరువాత పరిశీలించగా ప్లేటెడ్ బంగారమని గుర్తించారు. డిసెంబరు 28న ఈ సంఘటన జరగ్గా బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేశారు.

శ్రీవారి క్షేత్రంలో 14 నుంచి సంక్రాంతి సంబరాలు

- 15న నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు



ద్వారకాతిరుమల, జనవరి 2: శ్రీవారి క్షేత్రంలో ఈనెల 14 నుంచి 16 వరకు సంక్రాంతి సంబరాలు జరుపుతామని ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ఆలయ తూర్పు గోపురం వద్ద కోలాటాలు, భజనలు, నృత్యా లు, హరిదాసులు, బుడబుక్కల వేషధారణలతో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామ న్నారు. ఈనెల 15న నిత్యార్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని చెప్పారు. 16న స్వామివారు సమీప గ్రామమైన దొరసానిపాడుకు అట్టహాసంగా బయలు దేరి వెళ్తారని, ఈ ఉత్సవాన్ని తిలకించేందుక భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని ఈవో కోరారు.

శేషవాహనంపై శేషాచలవాసుడు

- ముగిసిన ద్రవిడప్రబంధ అధ్యయనోత్సవాలు


శేషవాహనంపై తిరువీధులకు బయలుదేరిన శ్రీవారు, అమ్మవార్లు

వెండి శేషవాహనంపై ఉభయదేవేరులతో కొలువు తీరిన శ్రీవారు క్షేత్రపుర వీధుల్లో ఊరేగారు. చిన్నవెంకన్న క్షేత్రంలో జరుగుతున్న ద్రవిడప్రబంధ అధ్యయనోత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ముక్కోటి ఏకాదశి పర్వదినం మొదలుగా ఈ ఉత్సవాలను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. తొలుత కల్యాణమండప ఆవరణలో పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వెండి శేషవాహనంపై ఉంచి అలంకరించి అట్టహాసంగా ఊరేగించారు. తమ ఇంటి ముంగిట స్వామి, అమ్మవార్లకు భక్తులు హారతులు పట్టారు.


శిథిలజీవి, ఖరీదు నాటికలో సన్నివేశాలు

నాటక రంగాన్ని బతికించుకోవాలి

ఏలూరు కల్చరల్, జనవరి 2: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందని ప్రముఖ రంగస్థల, సినీనటులు ఉప్పులూరి సుబ్బరాయశర్మ అన్నారు. స్థానిక వైఎమ్‌హెచ్ఏ ప్రాంగణంలో మంగళవారం గరికపాటి ఆర్ట్స్ థియేటర్- హైదరాబాద్, మహతి క్రియేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో సాంఘిక నాటకోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజుల పాటు జరిగే నాటకోత్సవాలను సుబ్బరాయశర్మ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మంచి సమాజాన్ని నిర్మించుకోవడానికి కళలు, నాటకాలు ఎంతో దోహదపడతాయన్నారు. మానవ విలువలకు ప్రతిరూపమే నాటకాలు అన్నారు. శ్రీశ్రీ విద్యాసంస్థల అధినేత ఎం.బి.ఎస్ శర్మ, లంకా వెంకటేశ్వర్లు మాట్లాడారు. తొలిరోజు మణికంఠ ఆర్ట్స్- పిఠాపురం వారి 'ఖరీదు' నాటిక, పెందుర్తి నటరాజ్‌ఆర్ట్స్ డమట్రిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'శిథిలజీవి' నాటికలు సందేశాత్మకంగా సాగాయి. నటీనటులు హావభావాలతో ప్రేక్షకులను రంజింప చేశారు. గరికపాటి ఆర్ట్స్ థియేటర్ వ్యవస్థాపకులు గరికపాటి కాళిదాసు పర్యవేక్షించారు. బుద్దాల వెంకటరామారావు, ఎస్.వి రామారావు, జి.దాశరథి శ్రీనివాస్, ఖాజావలీ తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం



పోడూరు, జనవరి 2: మండలంలోని గుమ్మలూరు శివారు రావిగొప్పులో వేంచేసియున్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి షష్టి తిథి మంగళవారం పురష్కరించుకుని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు పండితులు బాదంపూడి శ్రీహరివెంకట సుబ్రహ్మణ్యశర్మ మంత్రోర్చనలతో, వాయిద్య మేళతాళాలతో, భక్తజన సందోహం మధ్య స్వామి కల్యాణం కన్నులపండువగా జరిగింది. ఆలయ పునర్నిర్మాణ దాత పెన్మెత్స వెంకట నరసింహరాజు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


దీక్ష చేస్తున్న లాయర్లు

నల్లచట్టాలను రద్దు చేయాలి

నూజివీడు, జనవరి 2: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు కోరుతూ న్యాయవాదు లు కొద్ది రోజులుగా దీక్షలు చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం నిరసన దీక్షలో సీనియర్ న్యాయవాదులు మన్నెం రమేష్, వైఎస్ దొర్రై మాట్లాడుతూ పేదల భూహక్కులను హరించే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అనే నల్లచట్టాన్ని తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజల తరఫున చేస్తున్న ఈ ఆందోళనకు అందరూ మద్దతు ఇవ్వాలని వీరు కోరారు. ఈ చట్టం రద్దయ్యేవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఏలూరు టూటౌన్, జనవరి 2: ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు నగరంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం కార్మికుల సమ్మె 7వ రోజుకు చేరుకుంది. కనీసవేతనం ఇవ్వాలని, జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని నినాదాలు చేశారు. అనంతరం యూనియన్ నాయకులు సోమయ్య మాట్లాడుతూ అత్యవసర సర్వీసుల విభాగంలోని కార్మికులంతా కూడా సమ్మెలో పాల్గొంటున్నారన్నారు. సమ్మెను ఉధృతం చేయాలని నిర్ణయించామన్నారు. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించటంతో, కార్మికులు కూడా సమస్యలు పరిష్కారం అయ్యేదాక ఎంతకాలమైన సమ్మె కొనసాగుతుందన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె ఉధృతం


ఉద్యోగులకు మద్దతుగా టీడీపీ నేతల నిరసన

ఏలూరు కలెక్టరేట్, జనవరి 2: సమగ్రశిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె మంగళవారం 14వ రోజుకు చేరింది. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ ఉద్యోగులు మెడకు ఉరితాళ్ళు బిగించుకుని నిరసన తెలిపారు. తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. పరిపాలన చేతకాని సీఎం జగన్ మొండివైఖరితో ఎస్ఎస్ఏ ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యోగుల సమస్యలను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళతానని న్యాయం జరిగే వరకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ జేఏసీ నాయకులు భగవాన్ తదితరులు నాయకత్వం వహించారు.

న్యాయవాదుల దీక్షకు టీడీపీ నేతల మద్దతు


న్యాయవాదుల శిబిరంలో మాట్లాడుతున్న అనిల్

జంగారెడ్డిగూడెం, జనవరి 2 : న్యాయవాదులకు టీడీపీ మద్దతుగా ఉంటుందని ఆ పార్టీ యువ నాయకుడు బొమ్మాజీ అనిల్ అన్నారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌కు వ్యతిరేకంగా న్యాయవాదుల రిలే నిరాహార దీక్ష మంగళవారం 9వ రోజుకు చేరింది. జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ న్యాయవాదులు దీక్షను చేపట్టారు. దీక్షకు టీడీపీ పట్టణ, మండల నాయకులు మద్దతు తెలిపారు. బొమ్మాజీ అనిల్ మాట్లాడుతూ న్యాయవాదులు ఇన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా రిలే దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. న్యాయవాదులు టీఎస్ఎన్ మూర్తి, నిమ్మగడ్డ రాంబాబు, మానికల సూరిబాబు, చేను కోటేశ్వరరావు, కాపదాసు వెంకటేశ్వరరావు, ఎం.నాగులు, బలుసు శ్రీనివాసరావు, జువ్వల బాపూజీ, ఎ.రాము, ఈ.రామలక్ష్మి దీక్ష చేపట్టారు. శ్యాంసుందర్ శేషు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సాయిల సత్యనారాయణ, తూటికుంట రాము, పెనుమర్తి రామ్‌కుమార్, నంబూరి రామచంద్రరాజు, బొబ్బర రాజ్‌పాల్, మేక ఈశ్వరయ్య, ఎం.భువనేశ్వరి, టి.అశోక్ కుమార్, లతకుమారి పాల్గొన్నారు. టీడీపీ నేత గోరుముచ్చు గోపాలకృష్ణ యాదవ్ సాయంత్రం శిబిరానికి చేరుకుని మంగళవారం దీక్ష చేపట్టిన న్యాయవాదులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.

జన సేన మద్దతు


శిబిరంలో మాట్లాడుతున్న బాలరాజు

జీలుగుమిల్లి, జనవరి 2 : న్యాయవాదుల దీక్షలకు జనసేన పోలవరం నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు మద్దతు తెలిపారు. జంగారెడ్డిగూడెంలో లాయర్ల దీక్షలో పాల్గొని ప్రజల ఆస్తులకు రక్షణ లేని చట్టాల్ని రద్దు చెయ్యాలన్నారు. పసుపులేటి రాము, లాయర్లు టీఎస్ఎస్ఎన్ మూర్తి, ఎన్.రాంబాబు, ఎం.సూరిబాబు, సీహెచ్‌డివి.కోటేశ్వరరావు, జె.బాబ్జీ, రామలక్ష్మి ఉన్నారు.

● చింతలపూడి: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు వద్ద దీక్షా శిబిరం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకర్ల మాణిక్యాలరావు మాట్లాడుతూ ఈ యాక్టు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో చాగంటి రమాదేవి, కల్లేపల్లి సూరయ్య, దుర్గాభవాని, సీమ దీక్షలో పాల్గొన్నారు. తెలుగుదేశం నాయకులు జె.ముత్తారెడ్డి, జనసేన నేత చీదరాల మధుబాబు, టి.నాగవిజయకుమార్, మారుమూడి థామస్, పక్కాల వెంకటేశ్వరరావు, పలువురు సంఘీభావం తెలిపారు.

● ఏలూరు క్రైం: ఏలూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన 2023 భూ హక్కు చట్టం తక్షణమే రద్దు చేయాలన్నారు. రాజ్యాంగం ప్రకారం ఉన్న హక్కులను కాలరాస్తూ భూ హక్కు చట్టం ఉందని దీనిని తక్షణమే రద్దు చేయాలని, రద్దు చేసే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో

కామవరపుకోట, జనవరి 2: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య సురక్ష ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని డీపీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. కొత్తూరులో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2ను ఇన్‌చార్జి కలెక్టర్ టి.పూజా ఉమ, డీపీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, జడ్పీ సీఈవో కెఎస్ఎస్.సుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. వైద్యులు జె.తిరుమల, ఉమామహేశ్వరరావు, టీవీఎల్‌పి.కుమార్, లీలారెడ్డి ఆరోగ్య పరీక్షలు చేశారు. ప్రత్యేకాధికారి కృష్ణ మోహన్, ఆరోగ్యశ్రీ నోడల్ ఆఫీసర్ రాజీవ్, మండల ప్రత్యేకాధికారి ఎం.రాజు, ఎంపీడీవో కె.శ్రీదేవి, ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జడ్పీటీసీ కడిమి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: కేతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 మంగళవారం నిర్వహించారు. డెంగీ, మలేరియా, బీపీ, షుగర్ వంటి 9 రకాల రక్త పరీక్షలు నిర్వహించి 150 రకాల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఎంపీడీవో మంగాకుమారి, ఎంఈవో ఎస్.కళ్యాణి, డాక్టర్ ఫణీంద్రబాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సీహెచ్ కె.రాజు, సొంగా సిద్ధూ, గ్రామ కార్యదర్శి కృష్ణ శ్రీనివాస్, వీఆర్వో సీతారామ రాజు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో ఖాజావలీ

ఏలూరు రూరల్, జనవరి 2: సంక్రాంతి పండుగ రోజుల్లో సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్డీవో ఎస్ఎస్.కె ఖాజావలీ అన్నారు. కోడిపందేలు, జూదం నియంత్రణపై డివిజనల్, మండలస్థాయి అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడా కోడిపందేలు, జూదం, గుండాట జరగకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం మండలస్థాయి నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్రీడలపై నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పశుసంవర్ధకశాఖ జేడీ నెహ్రూబాబు, ఏలూరు, నూజివీడు డీఎస్పీలు శ్రీనివాసరావు, అశోక్‌కుమార్‌గౌడ్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి


నర్సులను సత్కరిస్తున్న అంబికా రాజా, క్లబ్ ప్రతినిధులు

ఏలూరు రూరల్, జనవరి 2: వైద్యరంగంలో నర్సుల సేవలు వెలకట్టలేనివని ప్రముఖ వ్యాపారవేత్త అంబికా రాజా అన్నారు. ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వంద మంది నర్సులను మంగళవారం సన్మానించారు. సరితలునాని, పీఎస్.లక్ష్మి, జి.అచ్యుత, ఝాన్సీ, పీడీసీ.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై ఆశా కార్యకర్తలతో సమీక్ష

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 2: ఆశా కార్యకర్తలు ప్రతీ ఇంటిని సందర్శించి అవగాహన కలిగించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. పవర్‌పేట, తంగెళ్ళమూడి అర్బన్ పీహెచ్‌సీల ఆశా కార్యకర్తలతో మలేరియా, డెంగీ, నులిపురుగుల నివారణ కార్యక్రమాలు, తల్లీబిడ్డ సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల అమలుపై మంగళవారం సమీక్షించారు. కొవిడ్, స్వైన్‌ఫ్లూ, జలుబు, ఆయాసం, ఇతర వైరల్ జ్వరాల నియంత్రణకుపై ప్రజలను చైతన్యపర్చాలన్నారు. జ్వరాలు, కొవిడ్ అనుమానిత లక్షణాలుంటే వైద్యాధికారులను సంప్రదించడంపై సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి గౌతమ్, సిబ్బంది ఝాన్సీ, శ్రీనివాసులు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.




పెదపాడులో గంగిరెద్దుకు, పెదవేగి, లింగపాడు మండలాల్లో దున్నపోతులకు వినతిపత్రాలు ఇచ్చి నిరసన తెలిపిన అంగన్‌వాడీలు


ఉంగుటూరులో చెవిలో పూలు పెట్టుకుని నిరసన

దున్నపోతు, గంగిరెద్దులకు వినతిపత్రాలు ఇచ్చి

నిరసన

22వ రోజు అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె

ఏలూరు కలెక్టరేట్, జనవరి 2: సమస్యలు పరిష్కరించకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద చెవిలో పూలు పెట్టుకుని నిరసన తెలిపారు. సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వీరంకి సాయిబాబు మాట్లాడుతూ 22 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కళ్ళు అప్పగించి చూస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే జగన్ చెవిలో పూలుపెట్టి ఇంటికి పంపించడం ఖాయమన్నారు. యూనియన్ అధ్యక్షులు టి.రజని, కార్యదర్శి దుర్గాభవాని, స్వప్న, అరుణకుమారి, నవతి, మల్లిక, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఏపీ ప్రగతిశీల అంగన్ వాడీవర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.భారతి, హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి కేవీ.రత్నం సంఘీభావం తెలిపారు. వారి వెంట ఐఎఫ్‌టీయూ నేతలు లక్ష్మి, సింహాచలం, ధనలక్ష్మి, క్రాంతి, నాని ఉన్నారు.

● పెదవేగి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని మూడు వారాలుగా సమ్మె చేస్తున్నా సీఎం స్పందించ లేదని విసిగిన అంగన్‌వాడీలు పశువులకు వినతిపత్రాన్ని ఇచ్చి నిరసన తెలిపారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు పి.ప్రసాద్ మాట్లాడుతూ చర్చల పేరిట బూటకపు మాటలతో దగా చేస్తున్నారని, న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. అంగన్‌వాడీలు కృష్ణవేణి, బేబీరాణి, త్రివేణి, నిర్మల, నాగమణి, ప్రభావతి, సూర్యకుమారి, నిర్మలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

● పెదపాడు: సమస్యలను వెంటనే పరిష్కరించేలా ప్రభుత్వానికి విన్నవించాలని బస్టాండ్ సెంటర్‌లో గంగిరెద్దుకు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతి పత్రాన్ని అందజేశారు. జీతాల పెంపుతో పాటుగా అనేక సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఎన్నికల తరువాత గద్దెనెక్కి తమను మోసం చేసిందని ఆరోపించారు. పెద్దసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● దెందులూరు: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లను విడగొట్టి ప్రభుత్వం లబ్ది పొందాలని చూస్తోందని అంగన్వాడీ నాయకులు బి.రంగమ్మ, కె.జ్యోతి, వరలక్ష్మి, హిమబిందు విమర్శించారు. రెండేళ్లలోపు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు సమ్మెలో పాల్గొనవద్దని జీవో జారీ చేయడం అన్యాయమన్నారు. జీవో కాపీని దహనం చేసి దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు.

● బుట్టాయగూడెం: అంగనవాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొరసా సతీష్ డిమాండ్ చేశారు. అంగనవాడీల ఆందోళనకు మద్దతు తెలిపారు. మడివి శ్రీనివాసు, కరకం శ్రీనివాసు, తాటి కన్నయ్య, మొడియం నాగమణి, నూర్జహాన్, కృపామణి, రామయమ్మ, రామలక్ష్మి, శ్రీదేవి, మున్నీ అంగనవాడీలు పాల్గొన్నారు.

● పోలవరం: అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు హితవు పలికారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ఆయన సంఘీభావం తెలిపారు. కుంచే దొరబాబు, బొడ్డు కృష్ణ, నునకాని రాంబాబు, నల్లా రాంబాబు, పట్టిసీమ సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, సముద్రాల సాయికృష్ణ, పీఎల్ఎస్ కుమారి, పద్మ, సరస్వతి, హైమవతి, కుబ్ర, జుబేద, వెంకటరమణ పాల్గొన్నారు.

● లింగపాలెం: అంగన్‌వాడీల సమ్మెను ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా సమస్యలు పరిష్కరించే సమ్మె కొనసాగిస్తామన్నారు. బీజేఎస్.కుమారి, వి.ఈశ్వరి, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

● చింతలపూడి: ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని శిబిరంలో అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు సత్తా వెంకటేశ్వరరావు అన్నారు.

● కామవరపుకోట: జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె 22వ రోజుకు చేరుకుంది. షేక్ సుబాషిణి, శాంతి, విజయ, పద్మ, విమల, ఆంథోని తదితరులు పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం తదితర పార్టీలు అంగన్‌వాడీల ఆందోళనకు మద్దతును ప్రకటించాయి.

● ఉంగుటూరు: అంగన్వాడీలు కళ్లకు గంతలు కట్టుకుని, చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఆర్.లింగరాజు నేతృత్వంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

● నిడమర్రు: అంగన్వాడీ సమ్మెకు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రంగావలి మద్దతు తెలిపారు. ఏపీటీఎఫ్, యూటీఎఫ్ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. నిమ్మల జయప్రకాష్, నాయుడు కొండయ్య, వీవీ.ప్రసాద్, లక్ష్మీనారాయణ, ఎస్‌కే. మలౌలి, అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, ఈశ్వరి, పార్వతి, జయమ్మ, సుభాషిణి, ప్రేమలత, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సత్తా వెంకటేశ్వరరావు, ఆర్‌వీఎస్ నారాయణ అంగన్‌వాడీలు, హెల్పర్‌లతో కలసి ఆందోళన నిర్వహించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ఆందోళన జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

● కుక్కునూరు: అంగన్‌వాడీల సమ్మెను పట్టించుకోకుండా సీఎం జగన్ మొండి వైఖరిని అవలంబిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆరోపించారు. మంగళవారం కుక్కునూరులో అంగన్‌వాడీల నిరసన దీక్షకు మద్దతు పలికారు. సీఐటీయ మండల కార్యదర్శి వై.సాయికిరణ్, యామిని, వెంకటాచారి, వై.నాగేంద్రరావు, కుంజా నాగలక్ష్మి, బాబూరావు, వరకా శ్యామల, స్వప్న, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి జన్‌భాగ్‌దారి కార్యక్రమం : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ

ఏలూరు రూరల్, జనవరి 2: విజయవాడలో ఈనెల 19న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు నాందిగా ఈ నెల 5 నుంచి 19 వరకు నిర్వహించే జన్‌భాగ్‌దారి కార్యక్రమం విజయవంతానికి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అధికారులకు సూచించారు. మంగళవారం అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 5న కళాశాల స్థాయిలో, 6న జిల్లాస్థాయిలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. 11న ఇండోర్‌స్టేడియంలో అంబేడ్కర్ జీవిత సంగ్రామంపై ఈ-ఫొటో ఎగ్జిబిషన్, మానవహారం, రక్తదాన శిబిరం, 18న మారథాన్, 19న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించాలని సూచించారు. జేసీ లావణ్యవేణి, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, డీపీవో తూతిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పది ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు


నగదు బహుమతి అందజేస్తున్న మాజీ ఎంపీపీ

కొయ్యలగూడెం, జనవరి 2: కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని మాజీ ఎంపీపీ మట్టా సత్తిపండు అన్నారు. ఈ మేరకు ఆయన సిద్ధార్థ పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు ఆయన నగదు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచే ఉన్నత చదువులకు ప్లానింగ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వనజాలక్ష్మి, సిద్ధార్థ పాఠశాల యాజమాన్యం రాజ్‌కుమార్, ఆనంద్ తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి చేరవచ్చు

ఏలూరు రూరల్, జనవరి 2: క్రమశిక్షణ, పట్టుదలతో జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని తెలుగుదేశంపార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి అన్నారు. శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లోని జింగిల్‌బెల్స్ పాఠశాలలో వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ఇష్టపడి చదవాలన్నారు. ప్రిన్సిపాల్ కడియాల విజయలక్ష్మి, పాఠశాల సంచాలకులు వి.సురేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

లింగపాలెం, జనవరి 2: మండలంలోని యడవల్లి, నరసన్నపాలెం, బోగోలు తదితర గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలపై ఆరా తీశారు. ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చూడాలని బీఎల్‌వోలను ఆదేశించారు. ఆయనతో పాటు ఈవోపిఆర్డి జె.ఎమ్ రత్నకుమార్, పంచాయతీరాజ్ ఏఈ జగన్నాథరావు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తి స్థాయి వసతులు

పెదపాడు, జనవరి 2: మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తున్నామని ఎంపీడీవో నరసింహామూర్తి తెలిపారు. పెదపాడు జూనియర్ కళాశాల, హైస్కూల్‌లో పోలింగ్ స్టేషన్లను మంగళవారం పరిశీలించారు. అందుబాటులో వున్న సౌకర్యాలపై రెవెన్యూ సిబ్బందితో ఆరా తీసి సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్.ఎం. వెంకటేశ్వరరావు, బీఎల్‌వో నటరాజన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు

జీలుగుమిల్లి, జనవరి 2 : జాతీయ పశు రోగ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ ఎం.సాయిబుచ్చారావు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్కి అవతారంలో జనార్దనస్వామి



ఏలూరు కార్పొరేషన్, జనవరి 2: అగ్రహారంలోని జనార్దనస్వామి కోవెల వద్ద ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారు కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అమ్మవార్లకు, స్వామివారికి ఆలయ అర్చకులు వంగల పవన కుమారాచార్యులు, వెంకటాచార్యులు అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో పెద్దింట్లరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

నగరంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, జనవరి 2: రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్వామివారి నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు, కోనూరి సత్యనారాయణాచార్యులు జరిపిస్తున్నారు. కళా వేదికపై కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. గరికపాటి ఆర్ట్ థియేటర్స్ వారు రామాంజనేయ యుద్ధం నాటకం ప్రదర్శించారు. ఆలయ ఈవో నాగం సన్యాసిరావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల సందడి నెలకొంది.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

జీలుగుమిల్లి, జనవరి 2 : అయోధ్య బాల రాముడి పూజ అక్షింతలు మంగళవారం గ్రామంలో ఇంటింటికి పంపిణీ చేశారు. టిఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అక్షింతలు అందజేశారు. వేదుల జనార్ధన్, టిఎస్. రామకృష్ణశర్మ, పి.నాగమణి, పి.పావని, కె.పూర్ణ ఉన్నారు.

● టినరసాపురం: అయోధ్య రామ మందిరం నుంచి స్వామి వారి అక్షింతలతో మంగళవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామ చుట్టు పక్కల రామాలయాలకు అక్షింతలు పంపారు. శివాలయం ప్రాంగణం వద్ద సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

● ఉంగుటూరు: యర్రమిల్లిపాడులో మురళి ఆధ్వర్యంలో అయోధ్య రామ అక్షింతల పంపిణీ చేశారు. 80 మంది మహిళలు ఈ శోభాయాత్రలో పాల్గొని జైశ్రీరాం నినాదాలతో పురవీధులలో కలియ తిరిగారు. కైకరంలో అయోధ్య అక్షింతలు ఇంటింటికి పంపిణీ చేశారు.

వికసిత్ భారత్‌లో గ్యాస్ కనెక్షన్ పంపిణీ

జీలుగుమిల్లి, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రానికి ఇచ్చే అభివృద్ధి నిధుల వివరాలు వికసిత్ భారత్ ద్వారా బీజేపీ నాయకులు ప్రజలకు తెలియజేశారు. స్వర్ణవారిగూడెం, గంగన్నగూడెం పంచాయితీల్లో బీజేపీ నాయకులు గిరిజన మహిళలకు గ్యాస్ కనెక్షన్‌లు అందజేశారు. నియోజకవర్గ కన్వీనర్ చాత్రాతి ప్రసాద్, మండల అధ్యక్షుడు కెవెల్.ప్రసాద్, ఎంపీడీవో కృష్ణప్రసాద్ పలు శాఖల అధిరారులున్నారు.

● ఉంగుటూరు: ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి అన్నారు. కాగుపాడు లో పేదలకు మంగళవారం గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేసారు. కడియాల ప్రేమ్ సాయి, అడపా శోభారాణి, వంజరపు దుర్గారావు, నూకల రోహిత్, పరిమి సత్యనారాయణ, విడియాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

11న సీజ్డ్ వాహనాల వేలం

ఏలూరు క్రైం, జనవరి 2 : జిల్లా రవాణా శాఖ అధికారులు సీజ్ చేసిన వివిధ రకాల వాహనాలను ఈనెల 11న వేలం వేయనున్నట్లు జిల్లా ఉప రవాణా కమిషనర్ రత్నకుమారి మంగళవారం తెలిపారు. సీజ్ చేసిన వాహనాలు ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయం, ఏలూరు ఏపీఎస్ఆర్టీసీ డిపోలో ఉన్నాయన్నారు. స్ర్కాప్‌గా అమ్మిన వాహనాలను సీబుక్ మంజూరు చేయబడదని, రవాణా పన్ను చెల్లించి వాహనాన్ని బదిలీ చేసుకోవాల్సి ఉందన్నారు. వేలం ద్వారా పాల్గొన్న వ్యక్తి మాత్రమే వాహనాన్ని బదిలీ చేయడం జరుగుతుందన్నారు. వాహనం నిర్బంధంలో ఉన్న కాలానికి పన్ను మినహాయింపు ఉందని తెలిపారు.


దర్మరాజు ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరిన వైసీపీ నాయకులు

జనసేన పార్టీలో వైసీపీ నాయకుల చేరిక

నిడమర్రు, జనవరి 2: పవన్ కల్యాణ్ ఆశయాలను, జనసేన సిద్ధాంతాలను ప్రజలలోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికలలో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పిలుపునిచ్చారు. మంగళవారం పెదనిండ్రకొలనులో వైసీపీ నాయకులు, కార్యకర్తలు సుమారు 500 మంది జనసేన పార్టీలో చేరారు. ధర్మరాజు వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. స్థానికులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సరం కేక్‌ను ధర్మరాజు కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఐటి వింగ్ కోఆర్డినేటర్ అయితం ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మల దొరబాబు, వంగా రఘు, చింతలపాటి బాసిరాజు, వాసు, గ్రామపార్టీ అధ్యక్షులు కోటి శ్రీను, జన సైనికలు తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ కూటమి విజయం ఖాయం



జెండా స్థూపం వద్ద మాట్లాడుతున్న నేతలు

కామవరపుకోట, జనవరి 2: రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ కూటమి విజయం ఖాయమని నేతలు అన్నారు. కళ్ళచెరువు గ్రామంలో జన సేన నాయకులు చావా అభిరామ్ ఆధ్వర్యంలో నిర్మించిన జనసేన జెండా స్థూపంపై నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య మంగళవారం పార్టీ జెండా ఆవిష్కరించారు. జనసేన, టీడీపీ నాయకులు వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు షేక్ వలీ, టీడీపీ నాయకులు గోరుముచ్చు గోపాల్‌యాదవ్, మేరువ శివ, వేంద్ర మణి, మామిడి అనీల్, అంజిబాబు, మోతేపల్లి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కొయ్యలగూడెం, జనవరి 2: ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని సీపీఐ మండల కారదర్శి జమ్మి శ్రీనివాసరావు కోరారు. మంగేపేటలో మంగళవారం ఉపాధి కూలీలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. రోజురోజుకు నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రెయిలీ జన్మదిన వేడుకలు

ఏలూరు టూటౌన్, జనవరి 2: దృష్టిలోపం గలవారికి ప్రత్యేక బ్రెయిలీలిపి ప్రదాత లూయీబ్రెయిలీ జన్మదిన వేడుకలు ఈ నెల 4న నిర్వహించనున్నారు. గిరిజన్ భవన్‌లో వేడుక నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పీఆర్ మణి తెలిపారు.

కోడి పందేలపై దాడి

చింతలపూడి, జనవరి 2 : చింతలపూడిమండలంలో గణిజర్ల, సీతానగరం గ్రామాల్లో కోడి పందేలపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వీరి నుండి పది వేల రూపాయల నగదు, ఐదు కోళ్ళు, మూడు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

డ్రైన్లు నిర్మించండి మహాప్రభో

ఏలూరు టూటౌన్, జనవరి 2: పాత డ్రైనేజీలను ధ్వంసం చేసి సంవత్సరం అవుతున్న నూతన డ్రైన్ల నిర్మాణం చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. శనివారపుపేట పాత తివాచి ప్రాంతంలో ఏడాది క్రితం పాతడ్రైన్ల స్థానే కొత్త డ్రైన్లు నిర్మిస్తామని చెప్పినప్పటికి ఇంత వరకు డ్రైన్లు నిర్మించలేదు. వ్యాపారాలు సాగక వ్యాపారులు నష్టపోతున్నారు. డ్రైన్లలో మురుగునీరుసరిగా పారక దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికైన త్వరిత గతిన డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్టీయూ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

పెదవేగి, జనవరి 2: ఎస్టీయూ రాష్ట్రశాఖ ముద్రించిన డైరీ, కేలండర్‌ను పెదవేగి ఎంఈవో సీహెచ్.బుధవాస్ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల నాయకులు పరసా నాగార్జున, ఎండీ.షఫీ, భూషణం, సూర్యనారాయణ, రేవతి, ప్రవీణ్, గుప్తా, రమేష్ పాల్గొన్నారు.

అభయాంజనేయుడి ఆలయం వద్ద అన్నసమారాధన

పెదపాడు, జనవరి 2: అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లుగా ఈవో కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ నెర్సు భూషణం, దేవాలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

పేద రోగులకు రగ్గులు అందించిన వైద్యులు

పోలవరం, జనవరి 2: ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం సూపరిం టెండెంట్ ఎంవి సతీష్ బాబు మంగళవారం పలువురు పేదలకు, పేద రోగులకు రగ్గులు పంపిణీ చేశారు. సహ వైద్యులు కొంతమంది తమకు వచ్చే ఆదాయంలో 5 శాతం స్వచ్చంద సేవల కోసం వినియోగించాలని సామూహికంగా నిర్ణయించుకోవడం జరిగిందని, ఆ కార్యక్రమంలో భాగంగా గత పదేళ్ళుగా పేదలకు పేదరోగులకు తమకు తోచిన విధంగా స్వచ్ఛంద సేవలు చేస్తున్నామని తెలిపారు. తమ వైద్య సిబ్బందిలో ఒకరు కొనుగోలు చేసి ఇచ్చిన రగ్గులను మండలంలో పలువురు పేదలకు, పేద రోగులకు పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ పేదలకు, నిరాశ్రయులకు సహాయం అందించే మానవతాదృక్పదం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు గెడ్డం జ్యోతి, అనెస్తీషియా డాక్టర్ రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చింతమనేని


అంకాలంపాడులో బాబు ష్యూరిటీ ప్రచారం


టీడీపీ కార్యకర్తతో మాట్లాడుతున్న బొరగం

బాబు వస్తేనే భవిష్యత్‌కు గ్యారెంటీ

చింతమనేని

పెదవేగి, జనవరి 2: వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని, నాలుగున్నరేళ్లుగా ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే బాబు అధికారంలోకి రావాల్సిందేనన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంపై సమీక్షించారు. ప్రజల భవిష్యత్‌కు చంద్రబాబు నాయుడు గ్యారెంటీ అని ప్రతి గ్రామంలో నాయకులు ప్రజలకు భరోసా ఇవ్వాలని చింతమనేని సూచించారు. ఇకపై ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండాలని, టీడీపీ ప్రకటించిన ఆరు అంశాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, యూఎస్.రామ్‌ప్రసాద్, తాతా సత్యనారాయణ, బొప్పన సుధాకర్, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, పరసా వెంకట్రావు, కొనకళ్ళ శివమణి తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: చింతమనేని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో యువత రక్తదానం చేశారు. వైసీపీ పతనం అంచున ఉందని రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు దగ్గరగా ఉన్నాయన్నారు. రక్తదానం చేసిన యువతను అభినందించారు. సీహెచ్.శేఖర్, నాగరాజు, యర్రా నవీన్, యూ.నవీన్, ఎం.రమేష్, మండల అధ్యక్షులు సుధాకర్, మిల్లుబాబు, ఎల్.శ్రీనివాస్, సత్యనారాయణ, నేతల రవి పాల్గొన్నారు.

● కామవరపుకోట: మండలంలోని అంకాలంపాడు, జలపావారిగూడెం గ్రామాల్లో గోరింక వెంకటేశ్వరరావు, కార్యకర్తలు ఇంటింటికి బాబు ష్యూరిటీ పత్రాలను అందచేసి సూపర్-6 పథకాలను వివరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలకు ప్రజల్లో మంచి ఆదరణ లభించిందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొల్లిన సత్యనారాయన, గరిమెళ్ళ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుంది : బొరగం

టినరసాపురం: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని పోలవరం నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. అప్పలరాజుగూడెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కలపాల నాగరాజు ఇటీవల ప్రమాదంలో గాయపడ్డారు. బొరగం శ్రీనివాసులు మంగళవారం నాగరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గన్నిన సురేంద్రనాథ్ చౌదరి, వెలిశెట్టి కాశీ, వెంకటకృష్ణ, ఎల్లిన జగన్, కొప్పర్తి అంజనేయులు, కలపాల జార్జ్ తదితరులు పాల్గొన్నారు.





ముసునూరు, ముదినేపల్లిలో దున్నపోతులకు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్వాడీలు



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న దీక్షలు

దున్నపోతుకు వినతిపత్రం

అంగన్వాడీల వినూత్న నిరసన » బెదిరింపులకు పాల్పడటంపై ఆగ్రహం

చాట్రాయి, డిసెంబరు 2: తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం చాట్రాయిలో అంగన్వాడీలు దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. కనీస వేతనం రూ. 26 వేలు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలు, బీమా సౌకర్యం కల్పించాలని నినాదాలు చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు విజయ, నిర్మలజ్యోతి, ప్రమీల మాట్లాడుతూ 22 రోజుల నుంచి సమ్మె చేస్తూ, అనేక రూపాల్లో నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌ఆర్ హనుమాన్, జి.రాజు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టిన దీక్షలు 22వ రోజుకు చేరాయి. హామీలను నెరవేర్చే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, పద్మజ్యోతి, మణి, విజయలక్ష్మి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

అల్టిమేటంపై ఆగ్రహం...

ఆగిరిపల్లి: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, అంగన్వాడీలు ఈ నెల 5వ తేదీలోపు విధులకు హాజరుకాకుంటే చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ అల్టిమేటంపై అంగన్‌వాడీలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీలు ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలమవడంతో మళ్ళీ సమ్మెబాట పట్టారు.

ముసునూరు: సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు 22 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ కార్యదర్శి పి.రాజకుమారి అన్నారు. ముసునూరు సచివాలయం వద్ద అంగన్‌వాడీలు దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి వినూత్న నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు విద్యావతి, శ్యామల, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం కైకలూరులో అంగన్వాడీ కార్యకర్తలు దున్నపోతుకు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. అంగన్వాడీల దీక్షలో బీసీ నాయకుడు లావేటి వీరశివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 22 రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా చర్యలు తీసుకుంటా మంటూ బెదిరింపులకు పాల్పడటం శోచనీయమన్నారు. న్యాయవాది రుద్రపాక రత్నాకరావు దీక్షకు సంఘీభావం తెలిపారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు పి. సుజాత, మీనాకుమారి, విజిత, ఉషా, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో అంగన్‌వాడీలు దున్నపోతుకు తమ గోడును వినిపించుకున్నారు. స్థానిక నిరసన దీక్షా శిబిరం నుంచి యూనియన్ నాయకులు సూరపనేని అరుణకుమారి, బండి పద్మ, కొలంగాని జయలక్ష్మి, మణి తదితరుల నాయకత్వంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ప్రదర్శనగా వెళ్లి దున్నపోతుకు వినతిపత్రాన్ని సమర్పించారు. దున్నపోతు ఎదుట నిలబడి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

కాంగ్రెస్ నేతల మద్దతు..

కలిదిండి: కలిదిండిలో అంగన్‌వాడీల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 రోజులుగా గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం అందక రక్తహీనతతో బాధపడుతున్నారని, అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి వారు విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ నేతలు అబిదా బేగం, మేనక, రమాదేవి, నాగలక్ష్మి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల సమ్మెలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాజు

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

నూజివీడు టౌన్, జనవరి 2: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జి.రాజు డిమాండ్ చేశారు. నూజివీడు పట్టణంలో మున్సిపల్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మె మంగళవారం 8వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అధ్యక్షుడు ఎన్.ఆర్. హనుమాన్, మున్సిపల్ యూనియన్ నాయకులు జయలక్ష్మి గోవింద్, ఏడుకొండలు, గాంధీ, జయరామ్, చంద్రశేఖర్, రజని తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో మార్పులకు మరో అవకాశం

నూజివీడు, జనవరి 2: ఓటర్ల జాబితా ముద్రించేందుకు మరికొంత సమయం ఉందని, మార్పులు, చేర్పులపై సలహాలు, సూచనలు ఇవ్వాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్ని రాజకీయ పార్టీల నేతలను కోరారు. మంగళవారం అఖిలపక్ష నాయకులతో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన సమావేశమమై మాట్లాడుతూ ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌లో అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వ సిబ్బందికి సహకరించాలని కోరారు.



నల్ల చట్టాలను రద్దు చేయాలని లాయర్ల దీక్షలు

నూజివీడు, జనవరి 2: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు కోరుతూ న్యాయవాదులు కొద్ది రోజులుగా దీక్షలు చేపట్టిన విషయం విదితమే. మంగళవారం నిరసన దీక్షలో సీనియర్ న్యాయవాదులు మన్నెం రమేష్, వైఎస్ దొరై మాట్లాడుతూ పేదల భూహక్కులను హరించే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అనే నల్ల చట్టాన్ని తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజల తరపున చేస్తున్న ఈ ఆందోళనకు అందరూ మద్దతు ఇవ్వాలని వీరు కోరారు. ఈ చట్టం రద్దయ్యేవరకు ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



కలిదిండి, జనవరి 2 : ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదివే విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి పాస్ అయ్యే విధంగా తీర్చిదిద్దాలని తెలిపారు. ఎంఈవో ప్రభాకర్ బాబు, ఎంపీడీవో దినతేజ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో నూతన ఆస్పత్రి భవనం ప్రారంభం



నూజివీడు, జనవరి 2: నూజివీడు ఏరియా ఆసుపత్రికి నిర్మించిన నూతన భవనం కొద్దిరోజుల్లో ప్రారంభమవుతుందని నూజివీడు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం ఆయన ఆసుపత్రిని సందర్శించి వైద్య సౌకర్యాలపై రోగులను ఆరా తీశారు. అన్ని సదుపాయాలతో ఆధునాతన వైద్యం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో అందుతుందని అన్ని విభాగాలకు వైద్యులు వచ్చారని వివరించారు. ఆయన వెంట వైసీపీ నాయకులు పిళ్లా చరణ్, దేవరకొండ మధు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ వైద్య సేవలు వినియోగించుకోవాలి

చాట్రాయి, డిసెంబరు 2: పెద్ద ఆసుపత్రుల నుంచి నిపుణులైన డాక్టర్లు గ్రామాలకు వచ్చి అందిస్తున్న వైద్య సేవలకు ప్రజలు వినియోగించుకోవాలని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కోరారు. కోటపాడులో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష వైద్య శిబిరంలో వైద్య నిపుణులు సుప్రియ(జనరల్ మెడిసిన్), జేమ్స్ డానియేలు(ఆర్థోపెడిక్), పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసులరెడ్డి, దుర్గాప్రసాద్, కంటి నిపుణుడు సురేంద్రబాబు 291 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ముసునూరు, జనవరి 2: గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష -2 చేపట్టిందని ఏలూరు జిల్లా పరిశీలకులు డాక్టర్ నరేంద్ర అన్నారు. మంగళవారం బలివే సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష క్యాంపును నిర్వహించారు. వైద్యులు టి.షకీన, ఇవాంజిలిన్, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ లావణ్య 486 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, సర్పంచ్ రావి ప్రవీణసుధాకర్, ఎంపీపీ కొండా దుర్గాభవానీ వెంకట్రావు, జడ్పీటీసీ డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజాలు మందులను అందజేశారు. ఎంపీడీవో జి.రాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



కలిదిండి, జనవరి 2 : పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కలిదిండిలో 162 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్‌తోపాటు కొత్తగా పెంచిన రూ.3 వేలు పింఛన్ పంపిణీ చేశారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, సర్పంచ్ మారుతీ ప్రసన్న, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, తిరుమాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య



కిరణ్మయి (ఫైల్)

నూజివీడు టౌన్, జనవరి 2: నూజివీడు పట్టణం నెహ్రూపేటకు చెందిన గృహిణి బాపట్ల ఉషా కిరణ్మయి (35) సోమవారం రాత్రి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు బంధువులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. పట్టణంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

కైకలూరు, జనవరి 2: కైకలూరు-గుడివాడ రైల్వే లైన్లో కైకలూరు మండలం ఆచవరం రైల్వేగేటు సమీపాన రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. కైకలూరు వెలమపేట కాలనీకి చెందిన బోరా శేఖర్(26) పూల దుకాణంలో పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వరకు స్నేహితులతో గడిపిన మృతుడు మంగళవారం ఉదయానికి ట్రాక్‌పై విగత జీవుడిగా పడి ఉన్నాడు. ట్రాక్‌మన్ మంగళవారం ఉదయం గుర్తించి రైల్వే ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. బహిర్భూమికి వెళ్లగా రైలు ఢీకొన్నట్లు కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ రైల్వే ఎస్సై వి. వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టంకు అనంతరం మృతదేహాన్ని అతని కుటుంబీకులకు అప్పగించారు.

మద్యం విక్రేత అరెస్టు

కలిదిండి, జనవరి 2: కోరుకొల్లులో చింతపల్లి వెంకట్రావు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు ఎస్‌ఐ ప్రియకుమార్ తెలిపారు. 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని

అభివృద్ధి సాధకులకే పట్టం కట్టాలి

ముదినేపల్లి, జనవరి 2 : అభివృద్ధి సాధించగల నాయకులనే ఎన్నుకోవాలని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు కామినేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ముదినేపల్లి మండలం ములకలపల్లి, అల్లూరు గ్రామాల్లో ఆయన గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయాలన్న తపన, అంకిత భావం కలిగిన ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రానికి అవసరమన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. గ్రామాల్లో రాజకీయ విబేధాలు పక్కన పెట్టి ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, పార్టీ నాయకులు చలసాని జగన్మోహనరావు, టీకేఎం నాని, పూల రామచంద్రరావు, బొప్పన సుందర రామయ్య, వీరమల్లు నరసింహారావు, దావు నాగరాజు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో కామినేనిని గ్రామస్థులు సత్కరించారు.



భైరవపట్నంలో హామీపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

భైరవపట్నంలో బాబు ష్యూరిటీ..

మండవల్లి, జనవరి 2: మండలంలోని భైరవపట్నం, కానుకొల్లులో టీడీపీ మండల అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, క్లస్టర్ కూనపురెడ్డి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు కాగానే కుటుంబానికి వర్తించే సంక్షేమ పథకాల హామీపత్రాలను మహిళలకు అందజేశారు. ప్రధాన కార్యదర్శి పళ్లెం ఏడుకొండలు, నాయకులు వీరాబత్తిన సుధా, భైరవపట్నం 19వ బూత్ కన్వీనర్ బొల్లంపల్లి కృష్ణారావు, గ్రామ అధ్యక్షుడు గుమ్మడి స్వామిదాస్, గడిదేశి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రహరీ కూలిన ప్రదేశంలో క్లాత్ ఏర్పాటు చేసిన దృశ్యం

బాలికల హాస్టల్‌కు ఇదేనా రక్షణ?

» రెండేళ్ల క్రితం ధ్వంసమైన ప్రహరీ » గుడ్డతో రక్షణ

కలిదిండి, జనవరి 2 : కోరుకొల్లులోని ఎస్సీ బాలికల హాస్టల్‌కు రక్షణ కరువైంది. హాస్టల్ భవనం పహరీగోడ ఒకవైపు కూలిపోయి సుమారు రెండేళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవు. భీమవరం - గుడివాడ ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ హాస్టల్ భవనానికి రక్షణ లేకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. నాడు - నేడు పనుల కింద హాస్టళ్ల రూపు రేఖలు మారుస్తామని పాలకులు చెబుతున్నప్పటికీ ఆ దిశగా పనులు జరగటం లేదని బాలికల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హాస్టల్ భవనం వద్ద పిచ్చిమొక్కలు దట్టంగా ఉండటంతో పాములు ప్రవేశించే అవకాశం ఉందని, ప్రహరీ కూలిన ప్రదేశంలో గుడ్డను కట్టి చేతులు దులుపుకున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి బాలికల హాస్టల్‌కు ప్రహరీగోడ నిర్మించాలని వారు కోరుతున్నారు.



గ్రామసభలో గ్రామస్థులు కానరాని దృశ్యం

గ్రామస్థుల్లేని గ్రామసభ!

» ప్రచారం లేకపోవడంపై పలువురి ఆగ్రహం

మండవల్లి, జనవరి 2: మండవల్లి మండలం మొకాసా కలవపూడిలో మంగళవారం నిర్వహించిన గ్రామసభ వెలవెలబోయింది. గ్రామసభపై గ్రామస్థులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మండవల్లి మండలం మొకాసా కలవపూడి పంచాయతీలో మంగళవారం సర్పంచ్ బొప్పన వెంకట శ్యామలత అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. 9 మంది వార్డు సభ్యులకు ముగ్గురు, సచివాలయ సిబ్బంది 9 మందికి ఏడుగురు హాజరయ్యారు. వలంటీరులు నలుగురు హాజరయ్యారు. గ్రామస్థులు ఒక్కరు కూడా హాజరు కాలేదు. సమయపాలన పాటించకపోవడం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొనకపోవడంతో, సమస్యలు పరిష్కారం కాక, ప్రజలు హాజరుకావడం లేదన్న వాదన వినిపిస్తోంది. గ్రామసభలపై విస్తృత ప్రచారం లేకపోవడం వల్ల కూడా గ్రామస్థులు హాజరుకావడం లేదు. పలు గ్రామాల్లో అసలు గ్రామసభలు జరగడం లేదని, మమ అనిపిస్తున్నారని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరుజిల్లా అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, మండవల్లి మండల శాఖ అధ్యక్షుడు టి. అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామసభ నిర్వహణ తీరును పరిశీలించేందుకు వచ్చిన వారు మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాబోయే గ్రామసభలైనా సక్రమంగా జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

అట్టడుగు వర్గాలకు పథకాలు చేరాలి



కైకలూరు, జనవరి 2: సమాజంలో అట్టడుగు వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు చేరాలనే మహా సంకల్పంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నట్టు కైకలూరు బీజేపీ కన్వీనర్ వేంపాటి విష్ణురావు అన్నారు. మంగళవారం గుమ్మళ్లపాడు, వదర్లపాడు గ్రామాల్లో యాత్రను నిర్వహించారు. అధికారులు కేంద్రం పథకాలపై వివరించారు. మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాషా, వికసిత్ భారత్ ఇన్‌చార్జి కీర్తి వెంకటరాంప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు కట్టా వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాలో కబడ్డీ పోటీలు

చాట్రాయి, డిసెంబరు 2: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండలంలోని మర్లపాలెం, చనుబండ, చిత్తపూరు, చిన్నంపేట జడ్పీ హైస్కూళ్ల ఆవరణలలో మంగళవారం కబడ్డీ పోటీలు జరిగాయి. 430 మంది ఆటగాళ్ళతో 23 మ్యాచ్‌లు నిర్వహించినట్టు ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు.

అయోధ్య అక్షింతలకు పూజలు



చాట్రాయి, డిసెంబరు 2: మర్లపాలెం ఆంజనేయస్వామి ఆలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు భక్తులు పూజలు చేశారు. వాటిని ఇక్కడ తయారు చేసిన అక్షింతలను రామనామం జపిస్తూ కలిపారు. వీటిని 5వ తేదీ నుంచి గ్రామంలో ప్రతి ఇంటికి పంపిణీ చేస్తామని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం చేయూత

ముసునూరు, జనవరి 2: ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలను అమలు చేస్తోందని వ్యవసాయ శాఖ మండల అధికారి ఎస్. మధుమోహన్ తెలిపారు. మంగళవారం బలివే, యల్లాపురం గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఏవో మాట్లాడుతూ కేంద్రం పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఎరువులు, పురుగుమందులపై సబ్సిడీతో పాటు అనేక పథకాలను అమలు చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు ఉపయోగించే రసాయనాల తయారీపై అవగాహన కల్పించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆముదాల ఇస్సాకు, మండల అధ్యక్షులు అనగాని రాంబాబు, ఎంపీడీవో జి.రాణి, ఏపీవో రోజ్‌లీలా తదితరులు పాల్గొన్నారు.

ఆకాశంలో మబ్బులు.. అన్నదాతలో ఆందోళన

సడలని నిబంధనలు » ధాన్యం కాపాడుకునేందుకు పాట్లు



ముదినేపల్లి, జనవరి 2 : రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో రోడ్ల వెంబడి ఉంచిన ధాన్యం రాశులను, ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ముదినేపల్లి నుంచి సుమారు 6 కిలోమీటర్ల దూరం రోడ్ల వెంబడి ధాన్యం రాశులు నిల్వ ఉండటంతో వాటిని పరదాలతో కప్పుకుంటూ వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల వేగం అందుకోకపోవటం, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ జాప్యం జరుగుతుండటంతో రోడ్ల వెంబడి ధాన్యం నిల్వ ఉండిపోయింది. తేమ శాతం తగ్గించేందుకు రైతులు గత పది రోజులుగా ముదినేపల్లి, పెయ్యేరు, పెద గొన్నూరు, వాడవల్లి తదితర గ్రామాల్లో ధాన్యాన్ని వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఆరబెట్టారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు రావటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకుని ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

చిన్నం సహకారంతో బోరు బావి నిర్మాణం



చాట్రాయి, డిసెంబరు 2: మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య ఆర్థిక సాయంతో చిన్నంపేట శ్మశానవాటికలో బోరుబావి నిర్మాణం చేపట్టారు. శ్మశానవాటికలో నీటి వసతి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని మాజీ సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, స్థానిక నాయకుడు సుజనరావు రామకోటయ్య దృష్టి తేవడంతో బోరు బావి నిర్మాణం మొదలైంది. బోరుబావికి చేతి పంపు బిగించి ప్రజల నీటి ఇబ్బందులు పరిష్కరిస్తామని నాయకులు చెప్పారు.

వృద్ధులకు దుప్పట్ల వితరణ



ముసునూరు, జనవరి 2: మండలంలోని చింతలవల్లి గ్రామంలో వృద్ధులకు మంగళవారం దుప్పట్ల పంపిణీ జరిగింది. సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కంకట జయరామ్ దంపతుల సౌజన్యంతో గ్రామంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేసి కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను అందజేశారు. ఎస్‌డీఏ చర్చి పాస్టర్ నెల్సన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి చేయూత



ముదినేపల్లి, జనవరి 2 : అప్పారావుపేటలో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన పరసా స్వరాజ్యలక్ష్మి కుటుంబానికి పలువురు ఆర్థిక సాయమందించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు రూ.25 వేల నగదు, నిత్యావసర సరుకులను అందజేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్య నారాయణ, సర్పంచ్ అల్లు సుశీల, కలిదిండి ఏఎంసీ వైస్ చైర్మన్ బత్తిన కిషోర్, నాయకులు జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్, అల్లా భక్షు, కోమటి విష్ణువర్ధన్, సాక్షి సాయి తదితరులు వీటిని బాధితురాలికి అందజేశారు.

ఎన్ఆర్ఐ క్రీడాకారుల ప్రతిభ



ఆగిరిపల్లి, జనవరి 2: జేఎన్‌టీయూ కాకినాడ నిర్వహించిన క్రికెట్ టీం ఎంపికల్లో ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయ్యారు. ఎంపికైన సీహెచ్ యోచన్, సాయి ప్రకాష్, కె.ఆర్యన్ తమిళనాడులో ఈ నెల 7 నుంచి జరగబోయే క్రికెట్ పోటీల్లో పాల్గొంటారు. వీరిని కళాశాల చైర్మన్ డాక్టర్ రావి వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నాగభాస్కర్, పీడీ తదితరులు అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సుశీల మృతి

ఆగిరిపల్లి, జనవరి 2: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పుత్తూరి సుశీల కుమారి (60) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. హెచ్ఎం పుష్పలత, నూజివీడు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.సేవ్యానాయక్, డీఈవో శ్యామ్‌సుందర్, ఎస్టీయూ నాయకులు తాడి నరసింహారావు, చౌటపల్లి సురేష్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆగిరిపల్లి, జనవరి 2: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఓటుహక్కుపై ఎమ్మార్వో ఉదయ్‌భాస్కర్, ఎంఈవో-1 సర్వేశ్వరరావు, ఈవో-2 ఆనంద్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ కూరపాటి యోహాను అధ్యక్షత వహించారు. కళాశాల తరపున ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఏర్పాటు చేసి వారికి పూర్తి అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ



ముసునూరు, జనవరి 2: రమణక్కపేట మెయిన్ స్కూల్లో మంగళవారం దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరం నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రశాంతి పదిమంది దివ్యాంగులకు చికిత్స అందించి వారిపట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత చికిత్సను అందించటంతో పాటు ఉపకరణాలు అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఎం కె.లోకరాజు, బి.సురేష్‌బాబు, ఐఆర్‌టీలు నారాయణరావు, నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.